
సంక్రాంతికి ముందటి రోజులు కనుక ఉదయంపూట చలిగాలి అలలు తాకుతోన్నాయి. దానికి తోడు తెల్లవారుజామునెక్కడో వాన కురిసిందేమో... మరింత చురుగ్గా, పదునుగా తాకి వణుకు పుట్టిస్తున్నాయి.

తనకు ఇవాళ 'ఆఫ్' అన్న సంతోషం లోపల్నించి తన్నుకొస్తుంటే, బయట చలిగాలి వణుకు పుట్టిస్తుంటే, వెంటనే 'కాఫీ' పెట్టుకొని తాగేసి, ఒంటిని వెచ్చబరుచుకోవాలనుకుంది సత్యవతి. 'కాఫీ' చేస్తున్నప్పుడు ''ఇవాళ యేమేం చెయ్యాలా?'' అని ఆలోచించింది.

# ముగ్గు

— రామకృష్ణారెడ్డి



అమ్మకు ఉత్తరం రాయాలి, చాలా రోజులయింది కనుక అనూరాధను చూడాలి, ఎన్నాళ్ళుగానో ఎదురు చూస్తున్న మంచి సినిమా వచ్చింది కనుక చూడాలి (వీలైతే అనూరాధతో కలిసివెళ్ళాలి), తను రాయాలను కున్న వ్యాసానికి అవసరమైన సమాచారం సేకరించు కోవాలి... ఇలా ఈ రోజు చేయవలసినవి వరుసగా జ్ఞాపకం వచ్చేసరికి నవ్వొచ్చింది. సెలవు రోజున యేమేం చెయ్యాలో వారం పొడుగునా ఆలోచిస్తుండడం, ఆ రోజొచ్చినప్పుడు ఏ ఒక్క పనీ చేయలేకపోవడం... ఎన్నోసార్లు జరిగిందే. ఈ రోజు ఇక ముందూ అలా జరగదని చెప్పడానికి లేదు.

కనుక, 'ముబ్బం పిన్ని' చెప్పినట్టు ''దేవుడు ఈ రోజు యేమేమి చెయ్యమంటే అవి చేయాలి తప్పితే మనంగా యేమీ చెయ్యలేం'' అనుకొని నవ్వుకొంది సత్యవతి. ''దేవుడు కాఫీ చేసుకోమన్నాడు, చేసుకున్నా; కప్పులో పోసుకోమన్నాడు, పోసుకున్నా... ఇంక స్టవ్ కట్టేయమనడూ? అంటాడు, ఆ మాత్రం దేవుడికి తెలీదా ఎట్లా? కట్టేశాను... ఇంక పేపర్ చూసుకో పో అన్నాడు దేవుడు, చూసుకుందాం'' ఈ మాటలు మనసులో అనుకోకుండా బయటికే నాటకంలో పాత్ర లాగా అనేసి, మనసారా నవ్వుకొంది సత్యవతి. కప్పు చేత పట్టుకునే గేటు దగ్గర పడేసిన 'పేపర్' కోసం వెళ్ళింది. గేటు దగ్గర్నుంచి వీధి కేసి చూస్తే... ఇరువైపులా వాళ్ళ వాళ్ళ గుమ్మాల ముందు ఆడవాళ్ళు శ్రద్ధగా ముగ్గులేసు కుంటున్న దృశ్యం. కొన్ని ఇళ్ళ ముందు తెల్లవారక ముందే పెద్ద పెద్ద ముగ్గులు వేసేశారు. వేసేసినవాళ్ళు తమ 'కళా ప్రతిభను' పక్కవాళ్ళకు ప్రదర్శించి, ఇంక వాళ్ళ 'కళా ప్రతిభను' తాము పరీక్షిస్తున్నట్టుగా, పక్కన వేస్తున్న ముగ్గులను దీక్షగా పరిశీలిస్తున్నారు. మొత్తం మీద ఆ వీధి ఆడవాళ్ళంతా తడిసిన చీరెల్తో, ముగ్గు పిండి చేతుల్తో చలిని లెక్కచేయకుండా క్రమశిక్షణ కలిగిన 'సాంస్కృతిక సైన్యం' లాగా ముగ్గులేసుకోవడంలో మునిగిపోయారు.

''హ్హా...'' అని సత్యవతి నిట్టూర్చి, పేపర్ అందుకొని వచ్చి ముందు గదిలో కూర్చుంది. కాఫీ 'సిప్' చేస్తూ ఒక్కో పేజీ తిరగేసింది. 'తెలుగు గంగతో రాయలసీమ సస్యశ్యామలం', 'బోఫోర్స్ గొడవలో కొత్త మలుపు' లాంటి 'పెద్ద శీర్షికల' నుంచీ, 'వివాహితపై అత్యాచారం', 'శీలం శంకించి భార్య హత్య' లాంటి 'సింగిల్ కాలమ్స్' వార్తల వరకూ వచ్చింది. ఆ వరుస లోనే 'మహిళలకు ముగ్గుల పోటీ' కూడా కనపడింది. వచ్చే ఆదివారం లయన్స్ క్లబ్‌వారూ, స్థానిక మహిళా పత్రికవారూ సంయుక్తంగా ఈ ముగ్గుల పోటీ నిర్వహించనున్నారట. విజేతలకు 'కలెక్టర్ శ్రీమతి చేత బహుమతి ప్రదానం.'

కాఫీ రుచిగా లేనట్టు అనిపించింది సత్యవతికి. ఈ కలెక్టర్ భార్యలకూ (ఛీ! ఛీ! ఈ కలెక్టర్ భార్యకూ, లేక ఈ కలెక్టర్ల భార్యలకూ అనాలి గదా), లయన్స్‌లకూ ముగ్గు వేయడం కూడా చేతయ్యుండదు. వాళ్ళ ఇళ్ళ ముందు వాళ్ళ పని మనుషులు వేస్తూ వుంటారు. ముగ్గు వేయడం తెలీకపోయినా, తెలిసివేయకపోయినా 'ముగ్గు కళ'ను పోషించే ఆ ముగ్ధ(లేక, ముగ్గు) హృదయం మాత్రం వుంటుంది. అవును మరి, లలిత కళలు స్త్రీల సొత్తు, పరుష కళలు పురుషుల సొత్తు గదా! ఒంటికి కొంచెం వెచ్చదనం ఇచ్చేందుకని సత్యవతి 'కాఫీ' చేసుకుని సేవించిందికానీ, ఇప్పుడు కోరుకున్నంత కంటే ఎక్కువ వెచ్చదనం వచ్చేసినట్టయింది. పైగా, ఈ వెచ్చదనం ఒక్క ఒంటి మీదే కాదు, ఆమె మనసు

మీద, ఆలోచనల మీద, మొత్తం భౌతిక జీవితాన్నంతా కమ్మినట్టయింది. ముగ్గులాగితే... డొంకంతా కదిలింది.

సత్యవతి వైవాహిక జీవితం సంప్రదాయబద్ధంగా, చట్టబద్ధంగా ప్రారంభమైనా ముగియడం ఈ రెండిట్నీ పట్టించుకోకుండానే ముగిసిపోయింది. దుష్టులకు దూరంగా వుండాలన్న మంచివాళ్ళలాగా, ఈ వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా ఆ రెండూ తమ 'పెద్దరికాన్ని' నిలబెట్టుకొన్నాయి. తన మొగుడి కన్నా తనకు తెలివితేటలూ, చదువూ ఎక్కువున్నందుకు సత్యవతి పడవలసిన నరకయాతనంతా పడింది. ఆ శిక్ష కూడా చాలదనుకున్నాడేమో ఆ మొగుడు, తన కన్నా అన్నివిధాలా అధమురాలైన మరో పెళ్ళాన్ని వెతికితెచ్చుకొని సంసార సుఖాన్ని పొందసాగాడు. విజయవాడలోని తన స్నేహితురాలు అనూరాధ సహాయంతో ఒక దిన పత్రికలో ఉద్యోగం సంపాదించుకుని ఆ దాంపత్య కూపం నుంచి బయటపడింది సత్యవతి. నెల్లూరు జిల్లాలో ఎక్కడో పల్లెటూళ్ళో కొద్దిపాటి భూమి ఆధారంతో జీవిస్తున్న తల్లి, ఉద్యోగ మొద్దూ, ఏమీ వద్దు తన దగ్గరే వుండిపొమ్మని మొదట గొడవ చేసినా, తర్వాత ఒప్పుకోక తప్పలేదు.

నెలకు 800 రూపాయల జీతంతో ట్రెయినీ సబ్ ఎడిటర్‌గా చేరి, మాచవరం డౌన్‌లో నెలకు 200 రూపాయల అద్దెకు ఒక రూమ్ తీసుకొంది. ఆ రూమ్ నుంచి కిటికీ గుండా చూస్తే, ఎదురుగా కొండ కనపడుతూ ఎంతో బావుండేది. చిత్రప్రసాద్ ఎప్పుడో బెజవాడ వచ్చినప్పుడు, మాచవరం కొండను చిత్రించినట్టు ఎక్కడో వ్యాసంలో చదివిన తర్వాత ఆ కొండను చూడడం ఇంకా బావుండేది. "మాచవరంలో ఎందుకూ? మాకు దగ్గరగా వుండూ?" అని అనూరాధ అంటే, "అక్కడ కొండ బాగుందే" అంది. "అయితే కొండ మీదే వుండరాదూ, ఇంకా బావుంటుంది" అని కసిరింది అనూరాధ. అట్లాంటి కొండను కూడా వదులుకొని రావలసి వచ్చిన సందర్భం జ్ఞాపకమొస్తే, కొండంత అసహ్యమూ, విరక్తీ ముంచుకొస్తుంది.

అయితే, తనకు అంత చిరాకును కలిగించిన ఆ సందర్భం, ఆ సమస్య మరొకరికి ఏ మాత్రం పట్టించుకోదగింది కాదనిపించవచ్చు. అనూరాధే అంది, "అంత చిన్న విషయానికి నీ కంత పట్టింపేమిటి?" అని. "అది చిన్న విషయమా?" అంది ఆశ్చర్యంగా. "కాక?"

"ఛీ! ఛీ! మాట్లాడకు" అని కోపంతో ఇక మాట్లాడలేకపోయింది తనే. అది చిన్న విషయం కాదని ఇప్పటికీ తన అనుభవం పదే పదే గుర్తుచేస్తూనే వుంది. పైకి కనిపిస్తున్న ఆ 'చిన్న విషయం' వేళ్ళు ఎంత లోతుగా, ఎంత బలంగా భూమిలోకి దిగిపోయాయో అనూరాధకు తెలీకనే అలా అంటోంది. ఒకప్పుడైతే తనకూడా అలాగే అనుకునేది. కానీ, ఇప్పుడు కాదు.

ఆమె పేరు అదేదో తమాషా పేరు. తెలుగు సినిమాల్లో వినిపిస్తూ వుంటుంది. ఆ... బుల్లెమ్మ ఆ భారీ కాయం పేరు బుల్లెమ్మ అంటే నవ్వొస్తుంది. ఒకప్పుడైనా ఆమె 'బుల్లెమ్మ'గా వుండి వుంటుందని ఊహించలేం. సాహిత్య సమావేశాల్లోనూ, జర్నలిస్టుల సభల్లోనూ తను తరచూ కనిపిస్తుండడంతోనూ, పత్రికల్లో అడపాదడపా తన వ్యాసాలు అచ్చుకావడంతోనూ కొద్దిమంది పరిచయమయ్యారు. అప్పుడప్పుడూ ఎవరైనా తన గదికి వచ్చి మాట్లాడి వెళ్ళేవాళ్ళు. తను 'నైట్ షిఫ్ట్' కూడా చేస్తుంది కనుక రాత్రిళ్ళు డ్యూటీకి వెళ్ళి గదికి చేరుకోవలసి వచ్చేది.


బుల్లెమ్మ ఇక ఆరాలు తీయడం ప్రారంభించింది. వివాహమయిందా? అయితే 'హాయిగా' సంసారం చేసుకోకుండా ఒంటిగా ఉద్యోగం చేయడమెందుకు? అమ్మా, నాన్నా ఏం చేస్తున్నారు, ఎక్కడున్నారు? ... ఇలా! మొదట్లో ఏదో మామూలుగానే అడుగుతోందని అన్ని వివరాలూ చెప్పింది. కానీ, తన మాటల్ని ఆమె నమ్మినట్టు లేదని, అవే ప్రశ్నలు మార్చి మార్చి అడగడంతో తెలిసింది. విసుగేసింది. "ఇంతకు ముందు అడిగారు, చెప్పాను" అనడంతో పాటు "ఇక చెప్పను" అన్న సూచనా చేసింది. దాన్తో, తనలో 'ఎక్కడాలేని, ఆడపిల్లకు తగని పొగరుమోత్తనం' కనిపించింది ఆమెకు. తన గదిలో ఎవర్తోనైనా మాట్లాడుతున్నప్పుడు గోడ చాటునుంచి వినడం ప్రారంభించింది. ఇలా బుల్లెమ్మ జబ్బు రకరకాల 'సైడ్ ఎఫెక్టు'లకు దారితీసింది.

అందులో ముఖ్యమయింది 'గది ముందు రోజూ ముగ్గువేయా'లన్న షరతు. బుల్లెమ్మ మొగుడు బుల్లెమ్మకూ, ఇంటికీ ఓనరేకాక, ఓ లారీ క్కూడా ఓనర్. అతనూ, అతని లారీ సిబ్బందీ ఆ గది ముందు రోడ్డు మీదనే వుంటారు కనుక, మగాళ్ళ కళ్ళకు ముగ్గులేని గుమ్మం కనపడుతూంటే బుల్లెమ్మకు చచ్చేంత సిగ్గుగా వుందట. మొదట్లో అలాంటి షరతేదీ లేదని గుర్తుచేస్తే, "వీధి ముందు గుమ్మం వున్నప్పుడు ఆ మాత్రం తెలీదూ? ఆడదానివి కాదూ?" అంది. "ముగ్గు వేయడం అన్నది ఆడవాళ్ళకు సంబంధించిన పనే అయినప్పుడు, ఆ సంగతి మగవాళ్ళ కెందుకు? గుమ్మం ముందు ముగ్గు వేస్తే అంత బాగుంటుందని అనుకున్నప్పుడు వాళ్ళే ఎందుకు వెయ్యకూడదూ?" ఈ వాదనతో ఇక బుల్లెమ్మకు పిచ్చెక్కిపోయింది. మరింత దురుసుతనానికి దిగి దేనికోదానికి పోట్లాట పెట్టుకునేది.

అనూరాధ సలహా ప్రకారం పనిమనిషిని ముగ్గు వేయమందామా అని ఒక బలహీన క్షణంలో అనుకుంది కూడా. వెంటనే తనను తాను తిట్టుకొంది. తనను 'ఆడ' పరిధిలో వుంచాలన్నది బుల్లెమ్మ ఆలోచన. ఆమెకు ఆ సంగతి తెలిసినా తెలీకపోయినా అందులోని అంతరార్థం అదీ. పనిమనిషి కూడా ఆడదే. ముగ్గు వేసేది తను కాదుకదా అని సరిపెట్టుకోలేదు. గది ఖాళీ చేయకుండా వుండేందుకు యింత దిగిపోవలసిన అవసరం లేదు. ఇంటి కోసం వెతికేటప్పుడు "గుమ్మం ముందు రోజూ ముగ్గు వేయాలి" అనే షరతు కూడా కొన్ని చోట్ల ఎదురయింది. "అది మాత్రం కుదరదు, నేను వేయను" అందొక చోట. ఆ ఇంటావిడ చాలా సౌమ్యంగా నవ్వుతూ అంది. "ముగ్గు వేయడం మీకు రాదేమో, పోనీ పనిమనిషితో వేయించండి, మా పని మనిషిని వేయమన్నా వేస్తుంది" అని సలహా ఇచ్చింది. "ముగ్గు వేయడం నాకు రాకేం? వచ్చు. అయినా వేయను, పనిమనిషి చేతా వేయించను" అంది. ఆ మాట కొంచెం ఉద్వేగంతో అన్నట్టుంది. "ఈ పిల్ల కొంచెం క్రాక్ లాగా వుందే" అన్నట్టు చూసిందావిడ.

అప్పుడు తెలిసింది తనకు పైకి చిన్న విషయాలుగానూ, మరో రూపంలోనూ కనిపించే వాటి యదార్థ స్వరూపాలు వేరని. అందుకే ఆ మధ్య జరిగిన మహిళా సభలో ఒకావిడ ఉపన్యసిస్తూ 'స్త్రీకి స్త్రీయే శత్రువు' అంటే కాదని గట్టిగా ఖండించింది. ఒక చిన్న గదికోసం అంత తీవ్రమైన అన్వేషణ జరపవలసి రావడం అనూరాధకు ఆశ్చర్యం కలిగించేది. "మనుషులకు యేవేవో కష్టాలు రావడం చూశాను కానీ యిటువంటి 'ముగ్గు కష్టాలు' రావడం యెరగను" అంది కొంత నవ్వులాటగా, కొంత ఆక్షేపణగా.

చివరికి ఈ స్టేట్ బ్యాంకి కాలనీలో ఈ గది దొరికింది. ఒక్క గదికి 300 రూపాయలు అద్దె అయినా, ఇంటివాళ్ళక్కొంచెం దూరంగా ఖాళీ స్థలం మధ్యనుంది కనుక...తీసుకొంది. అంతకంటే వీళ్ళు 'ముగ్గు షరతు' పెట్టకపోవడం ముఖ్య కారణం. అయితే తన అంచనా తప్పని కొద్ది రోజుల్లోనే తేలిపోయింది. ఆడవాళ్ళలో మోతాదులో తేడా తప్పితే ఎక్కువమంది 'బుల్లెమ్మ' లేవున్నారని స్పష్టమయింది. అయినా తను



ఆ మహిళా నాయకురాలిలాగా 'స్త్రీకి స్త్రీయే శత్రువు' అనుకోవడం లేదు.

ఇంటావిడా, డిగ్రీ చదువుతున్న ఆమె కూతురూ ఎప్పుడు చూసినా ఇంటిని కడుక్కుంటూనో, చిన్న చిన్న గుడ్డ పీలికలు పట్టుకుని గోడల్ని తుడుస్తూనో కనిపిస్తారు. ఏ పుస్తకమో, పేపరో ముట్టుకోగా చూళ్ళేదు వాళ్ళను. రెక్కలు ముక్కలు చేసుకొని వాళ్ళు చేసే 'ఇంటి చాకిరీ' చూస్తే జాలేస్తుంది. ఇటుకలూ, సిమెంటుతో కట్టిన ఆ ఇల్లే వాళ్ళ జీవిత సర్వస్వమైనట్టూ, వేరే జీవితం, ప్రపంచమూ లేనట్టూ కనిపిస్తారు.

“చూశారా, ఎలాంటి పిల్లను తెచ్చిపెట్టారో! నా మొఖాన ముగ్గులేదు. వారానికోసారయినా నన్ను కడగడం లేదు” అని గది కన్నీళ్ళు పెట్టుకొని వాళ్ళతో చెప్పుకొన్నట్టుగా వారానికోసారి గది కడగమని చెప్పడం మొదలుపెట్టారు. “చూడండీ, గదిని శుభ్రంగా వుంచుకోవడం నాకే మంచిది. నా సామాన్లు ఎంత నీటుగా వుంటాయో మీరొచ్చి చూడండి. ఇంక గదిని కడుక్కుంటూ ముగ్గులు తీర్చుకుంటూ వుండడమంటారా, నాకు కుదరదు. నాకంతకంటే ఎన్నో ముఖ్యమైన పనులున్నాయి” అని తెగేసి చెప్పింది. దాన్తో వాళ్ళ మొహాలు ముడుచుకున్నాయి.

అప్పట్నించీ మరీ 'డైరెక్ట్ ఆర్డర్స్' కాకుండా 'ఇన్‌డైరెక్ట్ ఆర్డర్స్' విడుదల చేయసాగారు. “ఇల్లు శుభ్రంగా లేకపోతే మా ఆయనకు మహా కోపం” లాంటి సూచన నుంచి “ఇంటి ముందు ముగ్గు లేకపోతే ఇంటికి దరిద్రం పట్టుకొంటుంది” అని, ఆ దరిద్రం సత్యవతేనన్నట్టు, ముఖం వికృతం చేసుకొని చూడటం వరకూ వెళ్ళింది. కొన్నిసార్లు విననట్టు వూరుకున్నా, వాళ్ళ 'ఇంటి చాకిరీ' చూసి కంపరమెత్తినప్పుడు తనూ కసిగా పోట్లాడింది. “ఆ దరిద్రమేదో ఈ గదిలో వుంటున్న నాకే వస్తుంది మీకేం? మీ అదృష్టం మీకుందిగా” అంది. అలాగాదట, దరిద్రం అద్దె వాళ్ళను వదిలేసి ఓనర్ల మీదికే పోతుందట! అలా అన్లేదుగానీ, సారాంశం అదే, వాళ్ళ భయం అదే. 'నిజమే దరిద్రం పట్టుకోకపోతే అస్తమానం అలా చాకిరీ చేస్తూనే వుంటారా' అనుకొని నవ్వుకుంది. “మా ఆయనకు మహా కోపం” అన్న సూచనకు “నాకు మా 'ఆయన' లేదు, కోపమొచ్చినా ఏడొచ్చినా నా స్వంతమే” అని ఇంకా రెచ్చగొట్టింది. ఫలితంగా ఇక్కడా పరిస్థితి చెడింది. మళ్ళీ...

* * *

అప్పుడే ఏడున్నర కావడం చూసి సత్యవతి మిగతా పనులకోసం కాఫీ కప్పు అందుకొని చటుక్కున లేచింది. ఈ లెక్కన ఈ రోజు చేయవలసిన పనుల్లో 'ఇల్లు వెతుక్కోవడం' కూడా ఒకటి. తను ఇందాక దీన్ని మర్చిపోయింది. ఇలా ఆలోచిస్తూ కూచుంటే యే పనీ చేయకుండానే 'పుణ్యకాలం' కాస్తా పోగొట్టుకుని 'పాప కాలమ్' (సింగిల్ కాలమ్) లో పడిపోవాలి.

* * *

సంక్రాంతి ఇంక రెండు రోజులే వుంది. ఇవాళ సత్యవతికి మళ్ళీ 'ఆఫ్'. డ్యూటీలో వున్న రోజుల్లో వార్తల



## గురి మారలేదు

అక్షరం మీద గురితోనే మొదలుపెట్టాను
అఆలు నేర్చుకున్న ఆనందంలో
అమ్మ అరక ఆట ఆకాశం
అన్నీ చిన్ననాటి అనుభవంలోనే రాసాను

అబద్ధం నేర్పడం విద్య అనీ
కల్పనకు లోకంలో గౌరవం వుందనీ
అనిబద్ధ సాహిత్యం వుంటుందనీ
ఆయుధం నన్ను గురి చూసేదాకా
నాకు తెలియనే తెలియదు

ఇంక
అక్షరాన్ని సాయుధం చేయడంకన్నా
నన్నయినా
అక్షరాన్నయినా
ఆదుకునే ఆసరా ఏముంది?!

—వరవరరావు

ప్రపంచాన్ని తప్ప అసలు ప్రపంచాన్ని చూసే అవకాశమే వుండదు. ఈ వారం రోజుల్లో 'గృహాన్వేషణ' జరగనే లేదు. పోనీ...ఇంటావిడ యింకా ఖాళీ చేయమన్లేదు గదా అనుకొంది. అప్పుడు గుర్తొచ్చింది...అయిదారు రోజులుగా ఆమె కనిపించలేదనీ, కూతురొక్కతే ఇంటి చాకిరీ చేసుకుంటోందనీ. పుట్టింటికి వెళ్ళిందేమో! కూతుర్ని వదిలేసి ఒక్కతే వెళ్ళి వుంటుందా?

పంపు దగ్గర నీళ్ళు పట్టుకుంటున్నప్పుడు అప్పలమ్మను అడిగింది. అప్పలమ్మ చెప్పిన వివరాల ప్రకారం. ఆమె పుట్టింటికే వెళ్ళింది. అయితే పండుక్కని కాదు. పుట్టింట్లో ఏడ్చి, మొత్తుకుని, పోట్లాడి (ఏ చావన్నా చచ్చి) యాభై వేలు డబ్బు తేవడానికని వెళ్ళింది...కాదు వెళ్ళగొట్టబడింది. ఆమె పుట్టిల్లు బందరు. తలిదండ్రులకు ఇద్దరూ ఆడపిల్లలే. ఇటీవల ఈమె అక్క కూతురుకు రెండు లక్షలు కట్నంతో పెళ్ళి చేశారు. ఆ కట్నం డబ్బులో యాభై వేలు ఈమె తండ్రి యిచ్చాడని ఈమె మొగుడికి తెలిసింది. “నువ్వూ నీ కూతురు కట్నానికి మీ నాన్న నడిగి యాభై వేలు పట్టుకొస్తే నా గుమ్మం తొక్కు, లేకుంటే మీ అమ్మా నాన్న దగ్గరే వుండు” అని గెంటేశాడు.

'స్త్రీకి స్త్రీయే శత్రువు' ఎలా అవుతూందో అర్థమవుతోంది. “ఆడదానివి కాదూ, 'ముగ్గు' వెయ్యడం రాదూ?” అన్నా, “ఇల్లు శుభ్రంగా లేకపోతే మా ఆయనకు మహా కోపం” అన్నా, స్త్రీలు యే నేపథ్యం లోంచి, ఏ పంజరంలో వుండి ఆ 'చిలక పలుకులు' నేర్చుకుని వల్లిస్తున్నారో అర్థమవుతోంది. “ఇల్లు చూసి ఇల్లాలిని తెలుసుకోవచ్చు” అవును, అవును. ఇల్లాలు యిలా అనుకునే మురిసిపోతూ వుంటుంది. అవసరమైనప్పుడు మాత్రమే 'ఇల్లాలుడు' బయటపడతాడు. అప్పుడు ఇల్లాలు వీథిలో పడుతుంది. అంతవరకూ ఇంటి సామ్రాజ్యం అంతా ఇల్లాలిదే.

ఇంటావిడ కూతురు ఒక చేత బకెట్, యింకో చేత తుడుపు గుడ్డా పట్టుకుని. వసారా తుడుస్తోంది. ఇలా అస్తమానం వ్యసనం పట్టుకున్నట్టు చాకిరీ చేసిన ఇల్లాలు...హీన స్థితిలో వెళ్ళిపోయింది. యాభై వేలు పట్టుకొస్తే 'మొగుడు' మళ్ళీ ఆమెకు 'గృహ సేవ' చేసుకునే అవకాశమిస్తాడు. తన కట్నం డబ్బు కోసమని తల్లిని అంత అవమానించి తరిమితే ఆ మొగవాణ్ని అసహ్యించుకుని ఆడదాని వైపున నిలబడకుండా 'డిగ్రీ' చదువుతున్న ఈ కాబోయే 'ఇల్లాలు' పట్టించుకోకుండా యథాప్రకారం చాకిరీ చేస్తోంది. ఆ 'ఇల్లాలికీ', ఈ కాబోయే ఇల్లాలికీ యిదేమీ ఘోరంగా కనిపించక పోవచ్చు. 'సంసారం చక్కబెట్టుకోవడం'గానే కనిపించవచ్చు.

ఇక ఆ అమ్మాయిని చూడలేనట్టు సత్యవతి వీథివైపు కొచ్చింది. వీథిలో ప్రతి ఇంటి ముందూ తీర్చిన ముగ్గులు. 'ముత్యమంతా పసుపు ముత్యాల ముగ్గు'. గుమ్మం ముందు ముగ్గుంటే గృహానికి శోభ, గృహిణికి సౌభాగ్యం.' ఛి ఛీ సత్యవతీ! నువ్వేదో సినిక్‌లా వున్నావు. నీకు ఈస్తటిక్ సెన్స్ లేదు. జీవితాన్ని సుందరంగా తీర్చుకోవడం తెలీదు. నీది భారతీయాత్మ కాదు, ఆడ ఆత్మ అసలే కాదు' కళ్ళు మూసుకుని పడక్కుర్చీలో వాలిన సత్యవతి చూపులో ఓ దృశ్యం బ్రహ్మాండమైన రూపంతో కనిపిస్తోంది. అది అందంగా విషాద బీభత్సంగా వుంది. పద్మవ్యూహంలాంటి ముగ్గు అది. ఎంతో తెలివితో, ఎంతో నేర్పుతో, ఒక గీతనుంచి యింకో గీతకు ఎలా కలిపిందీ ఎంత నిశితంగా పరిశీలించినా కనిపెట్టలేనంత గొప్పగా వేసిన ముగ్గు!

ఆ రంగవల్లి రచన అంతరాయం లేని నిరంతరాయంగా అలా సాగుతోనే వుంది. దానికి పూర్తి, అసంపూర్తి అన్నవి లేవు. సుందరమైన, సుకుమారమైన వేళ్ళు కాదు ఆ ముగ్గును వేస్తున్నది. బలంగా, మోటుగా తాటాల్లాగా వున్న మొగ వేళ్ళు. ఆ ముగ్గు మధ్యన నెత్తిన పూల రేకుల్తో పులకిస్తూ, లేక విలపిస్తూ పేద గొబ్బిళ్ళు...అవును ఆడ పేద గొబ్బిళ్ళు, పేద ఆడ గొబ్బిళ్ళు, గొబ్బి దేవతలు...ఆ దేవతల పేద బొమ్మల్లో బుల్లెమ్మ 'ఇంటావిడ' వంటి కోట్లాది ఇల్లాళ్ళ పోలికలు...ఇంటావిడ కూతురు వంటి భావి ఇల్లాలు...తన లాంటి మాజీ ఇల్లాలు ఇందులోనే...ఇందులోనే...!